



# మన రచయిత/త్రులు

## మద్దూరి రాజ్యశ్రీ

'మన రచయిత/త్రులు' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం.యస్.రావుగారి అమ్మాయి. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్క్ చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.

## మాదిరెడ్డి సులోచన - సమకాలీన దర్పణం

*ధనంతోనే జీవితం సుఖంగా గడుస్తుందా? ఈ కాలంలో అంతేమరి. డబ్బును చులకనగా తీసిపారెయ్యకు. లేచినప్పటినుంచీ పడుకోబోయే వరకు దాని అవసరం ఎంతయినా ఉంది. డబ్బుతోనే లేని బాంధవ్యాలు ముడిపడతాయి. ఉన్నవి తెగిపోతాయి. ప్రేమ, పెళ్ళి, చావు, బతుకు అన్నీ దాంతోనే తెలిసిందా?*

కాసుకు లోకం దాసోహం, పైసామే పరమాత్మా, ధనమూల మిదం జగత్, ఓం రూపాయనమః అని ఇన్ని రకాలుగా డబ్బుకున్న విలువని, మనుష్యుల్లో ఉన్న ధనాగమ తృష్ణని ఎప్పటికప్పుడు ఎన్ని రకాలుగానో ఎందరో వర్ణించారు. మాదిరెడ్డి సులోచనగారు అలా డబ్బు కోసం మనుష్యులు ఎలా గడ్డికరుస్తారో, తల్లిదండ్రి లేక పరాయి పంచన చేరిన వారిని ఎలా చిన్న చూపు చూస్తారో కళ్ళకి కట్టినట్లు వర్ణిస్తారు.

కయ్యిమని లేచింది జానకమ్మ 'వాడికిద్దామని ఎవరునుకున్నారు? మీరు అనుకోవచ్చు. తల్లీ తండ్రి లేని దాన్ని తెచ్చారు. నా పిల్లల కన్నా మిన్నగా పెంచారు. స్కూల్ ఫైనల్ వరకూ చదువు చెప్పించారు చాలదా? నా కొడుక్కి మాత్రం ఆ పిల్లను పెండ్లి చేయటానికి వీల్లేదు. '

'ఏం ఆ అమ్మాయికేం తక్కువ?'

'అన్నీవున్నాయి అసలు కావాలసిందే లేదు. గుణం, రూపం ఉంటే చాలా? నా బాబుకు కళ్ళు మూసుకుని పాతికవేలు ఇస్తారు ఎవరన్నా '

అలా వాళ్ళ నెత్తిన ఉన్న అమ్మాయిలని ఎలా రాచిరంపాన పెడతారో ఇంకో నవలలో అంటారు. 'ఏం రోగమే, ఈ చీర నీదనుకున్నావ్? మీ అమ్మదా? ఫుల్‌వాయిల్ చీరలంటే ఏమనుకున్నావు? నలభై దాటాయి. మీ కాలంలో నలభై పెడితే మంచి బెనారసు చీర వచ్చేది. దిక్కులేనిదని దయతలిస్తే నా నెత్తిన ఎక్కుతున్నావు.' అన్ని మాటలనీ సహనంతో భరించినా కూడా ఇలాటి గయ్యాళి అత్తలకీ, పిన్నులకీ తృప్తి ఉండదు. 'ఈ శనిని ఇంట్లోంచి విరగడ చేస్తే గానీ నాకు శాంతి ఉండదు. మన పిల్లల భవిష్యత్తుకు అడ్డుగా నిల్చున్నది. ఒక్క మాట మీరు వినాలి. దాని విషయంలో జోక్యము కలుగ చేసుకోనని మాట ఇవ్వండి.'

అలా వెళ్ళగొట్టబడిన శని బైటికెళ్ళాక కూడా బాగుపడకూడదు. అరాచకత్వానికి అంతుందా? 'తను పెంచిన అనాధ! తన చేతి క్రింది నీరు తాగే కులం గోత్రం లేని దాని కూతురు? ఆహ్! మకుటం లేని మహారాణిలా తిరుగుతోంది. దేవుడూ గుడ్డివాడు. వాడి గుడ్డి కంటికి మంచి ఏదో చెడు ఏదో తెలియటం లేదు.'

మానవ సంబంధాల గురించిన విశ్లేషణ కూడా ఎంతో బాగుంటుంది. తండ్రీ కూతుళ్ళు మధ్య, భార్యాభర్తల మధ్య, అత్తాకోడళ్ళ మధ్య, అన్నా చెల్లెళ్ళ మధ్య, ఇరుగుపొరుగు మధ్య ఉండే గొడవలు, ఉండాల్సిన సక్యత, వాటి అవసరం ఎన్నోచోట్ల చూపిస్తారు.

'అక్కడే పొరపడుతున్నావు. ఇంట్లో వాళ్ళు ఒకరితో ఒకరు కలిసి మెలసి ఉండాలి. ఆవిడ మనకన్నా పెద్దది. కొన్ని విషయాలలో మనము లొంగి ఉండాలి. ఆమె ప్రపంచమంతా నా చుట్టే ఉంటుంది. నా భార్యవైన నీ చుట్టూ ఉంటుంది అలా పట్టీపట్టనట్టుంటే అనురాగాలకు, ఆప్యాయతలకు తావే ఉండదు' భార్యని భర్తమందలింపు.

'ఇన్ని జరిగినా నీకు కనువిప్పు కాక పోవటము ఆశ్చర్యముగానే ఉంది. నీ వెట్టి ప్రేమతో మా జీవితాలు పాడు చేశావు. కొండమీది కోతినిచ్చే, మమ్మల్ని కోతుల్ని చేశావు. మొన్నటికి మొన్న బ్యాంకులోంచి డబ్బు తీసి పెద్దన్నయ్య కెందుకిచ్చినట్టు? ఇది వరకే కొంప గుండమయి పోయింది.' తల్లిని కూతురి మందలింపు.

'ఎవరైనా ఎప్పుడైనా ఎవరితోనైనా కలహించవచ్చు. విరోధించవచ్చునేమో గాని ఇరుగు పొరుగువారితో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ విరోధించరాదు. ఎందుకంటే అర్ధరాత్రి పిలిచినా పలికేది పొరుగువారే! ఏ సాయం కావలసి వచ్చినా అందుబాట్లో ఉండేది పొరుగువారే!'

అప్పటి కాలమాన పరిస్తితులు సాంఘిక దురాచారాలు, వాటి కింద నలిగిన స్త్రీ పరిస్థితి, అయినా ఎదురు తిరగకుండా వాటిని సహనంతో ఎలా భరిస్తుందో అడుగడుగునా కనిపిస్తుంది.

'ఆడపిల్లలు కూడా చదువుకుని మగవాళ్ళతో సమానంగా విజ్ఞానం సంపాదించి ఉద్యోగాలు కూడా చేస్తున్నారీ నాడు. అయినా వాళ్ళకూ ఒక మనసుంటుందని అందులో ప్రేమ, వాత్సల్యం, అభిమానం ఉంటాయని వారికి మంచి చెడులు ఆలోచించుకోగల హృదయముంటుందని మనం ఆలోచించటం లేదు. వారి ఆలోచనలకు, అభిప్రాయాలకు విలువ నివ్వటం లేదు. వారి ఇష్టాఇష్టాలతో పనిలేదు. మనం చెప్పినట్లు విని, గంగిరెద్దులా తలొంచుకుని, మనం నిర్ణయించిన వాడితో తాళి కట్టించుకుని కష్టమైనా, నష్టమైనా అనుభవించాలి. ఇదేగా పెద్దరికంతో మనం చేస్తున్న ఘనకార్యం? అది ధర్మమా?' అలా ఛెర్నాకోలుతో కొట్టినట్టుగా మనలో ఆలోచనలు లేపి జీవిత బాటలో ఎలా నడవాలో కూడా మనకు ఎన్నో సూత్రాలు జొప్పించారు.

'నిత్యం కాలకృత్యాలు తీర్చుకోవటం ఎలా తప్పని సరో! అలాగే తన వృత్తి ధర్మాన్ని నిర్వహించటం కూడా ముఖ్యమే.'

'స్త్రీలుగానీ, పురుషులుగానీ తమకున్న దానితోనే తృప్తిపడి లేనిదాని కోసం అర్రులు చాచకూడదు. తమకు లేదని చింతిస్తూ, ఉన్నవారిని చూచి అసూయపడటం అంతకన్నా మంచిది కాదు. ఇతరుల సౌభాగ్యం చూసి ఆనందించాలే గానీ అసూయ చెందరాదు'

అక్షరలక్షలిచ్చే ఇలాటి సూక్తులవల్లే కత్తికన్నా కలం గొప్పది అన్నారు మన పెద్దలు.

## అందగాడు - మాదిరెడ్డి సులోచన

ఆడపిల్ల జీవితం అంటే ఆయన (ధర్మయ్య) దృష్టిలో లేత మొక్క. వివాహంకాగానే ఆ మొక్కను మరో తోటలోనాటి, మాలికి అప్పగిస్తారు. మాలి సమర్ధుడైతే ఆ మొక్క పెరిగి, పెద్దదై భూభాగంతో పాతుకుపోతుంది. తన ఛాయలో నలుగురికి రక్షణ ఇస్తుంది. మాలి దుర్మార్గుడయితే వడలి వాలిపోతుంది. అందుకే తన కూతురు కళావతికి వెతికి పట్నం నుంచీ అందగాడిని తీసుకొచ్చాడు ధర్మయ్య.

'మా పిల్ల నలుపు బాబూ, ఈ సంబంధం కుదరదు' అంటే 'మనసుకి మకిలి లేకుంటే చాలు' అన్నాడట. పెళ్ళికూతురుకి పెట్టిన చీరలన్నీ అతనే కొన్నాడట. ఏం రంగులు! ఎంత బాగున్నాయో! అందుకని 'అందగాడే కాదు మనసూ అందమైనదేనట' అని ఊరంతా సర్టిఫికెట్ ఇచ్చేసింది! ఒక లక్ష రూపాయలు కట్నం తీసుకుని పెళ్ళి చేసుకున్నా సరే!

తల్లి రోజూ మీగడ, పంచదార పెట్టేది. పాలతో స్నానం చేయించేది. వెన్నముద్దలు మింగించేది, చారెడు నెయ్యి వేసుకుని తినేది. ఎన్ని చేసినా ఆ శరీరం గెడ కర్రలాగే ఉండిపోయింది. ఎంత డబ్బుని చూసినా, తన అందానికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వని భర్తంటే కళావతికి ఎక్కడలేని గౌరవం కలిగింది. అతని ముందు ఆత్మార్పణం చేసుకుంది.

ఇనుము వేడిగా ఉన్నప్పుడేవంచాలన్నట్టుగా కళావతిని తనకి కావాల్సినట్టుగా మలుచుకున్నాడు. ఎవరైనా నీ భర్త ఫలానా అమ్మాయితో తిరిగాడు అని అన్నారనుకో నవ్వేసి, హుందాగా నేనే తిరగమని మా ఆయనకు చెప్పాను అన్నావనుకో వాళ్ళ ముఖం మాడిపోతుంది! అలాగే పేకాట, అలాగే తాగుడు, 'మా ఆయన ఏది చేసినా నాకు చెప్పి చెస్తారు అంటాను సరా!' అంటుంది.

తన భర్త రేసులకెళ్ళాడు అని విని బాధ పడితే, 'ఏయ్ ఇదుగో అంటూ నిన్ను పిలిస్తే ఏం బావుంటుంది? కళా అంటున్నాను. అంటే నాగరికత పెరిగింది. ఈ కలికాలంలో త్రాగుడు, జూదం, రేసులు, స్త్రీ వ్యామోహం నాగరికత లక్షణాలు, అర్థం అయిందా!' అని నోరుమూయిస్తాడు.

అతని మీదున్న వెఱ్ఱి అభిమానంతో అతను ఆడమన్నట్టుగా ఆడుతుంది. చివర్లో తనే చెపుతుంది 'అమ్మా! ఆయనకోసం ఏ భార్యా చేయని పనులు చేశానమ్మా! బదుళ్ళు, అప్పులు చేశాను. అబద్ధాలాడాను. అన్యాయంగా మాట్లాడాను. ఆడవారిని అలంకరించి పంపాను. ఇంకేం చేయమంటావమ్మా.'

'కళా నా తల్లీ, ఎన్నెన్ని ఊహించి నీ పెళ్ళి చేసామే! అతనితో సవ్యంగా కాపురం చేస్తే ఈ గొడవలుండవు తల్లి వినలేకపోతున్నాను.'

అమ్మా! విత్తనం వేయగానే నీరు అందితే అది మొలకెత్తుతుంది. నాలో కోరికలు, ఆవేశం అన్నీ ఎండి బీటలు వారాయమ్మా, మీకు ఒక్కగానొక్క కూతుర్ని నా గురించి మీరు అంతా మంచే వినాలనుకుంటారని ఆత్మను చంపుకుని అబద్ధాలు ఆడాను.

అందం లేకపోయినా శరీరం వుంది! దానికి వేడి ఉంది. ఆ వేడిలో నేను కాలిమసి అయినాను. బయట స్త్రీలు దొరకని నాడు వచ్చే భర్తను సిగ్గువిడిచి ఒక్క రాత్రి నాతో గడపమని వేడుకున్నాను. బతిమాలాను. నా అందంతో ఆకర్షించలేను, నా ఆరాధనతో అభిమానంతో ఆయనను గెలుచుకోవాలనుకున్నాను.

ఎన్ని కూడని పనులు చేశాను? పరాయి స్త్రీల ముందు ఆయన గొప్ప తనం పొగిడాను. పరాయి స్త్రీలతో కులుకుతుంటే ఆయన మగసిరికి ముచ్చట పడాను. ఆయన ఆటలకు అప్పులు చేశాను. అమ్మా చెప్పమ్మా! మీరంతా భార్యలేనే, మీరెవరైనా చేశారా?

ఈ ఒక్కపూట ఇంట్లో గడపమని బతిమాలితే, నీ ముఖం చూస్తే కోరికలు కోటి మైళ్ళు దూరం పారిపోతాయి అన్న మనిషితో కాపురం చేయాలా? నా అభిమానాన్ని క్రూరంగా నలిపి గాయపరిచాడు. అతన్ని చూస్తే అసహ్యం తప్ప మరో భావనే కలగటం లేదు. అతన్ని చేరపోతే అతను అన్న మాటలు ఒక్కొక్కటీ గుర్తుకు వచ్చి, ఈ శరీరం మంచుకంటే చల్లబడుతుంది.

అలాంటి అందగాడి వలలో చిక్కారు కళావతి స్నేహితురాలైన శోభ, కళావతికి వదిన వరసైన శ్రీలక్ష్మి. 'రాత్రి రెండుగంటలకు వస్తానని రాశాడు. తలుపు తీసి ఉంచవద్దనుకున్నాను. కానీ బలహీనత, వయసు, ఆశ, అతని అందం నన్ను పిచ్చిదాన్ని చేశాయి. అందుకే ఆ రాత్రి తలుపు తీశాను. అతను నన్ను ఆకాశానికి ఎత్తివేసి నా వొడిలోనే స్వర్గం అన్నాడు. ఆ క్షణంలో నాకు అతనొక్కడే సర్వస్వంగా అనిపించాడు స్త్రీల బలహీనత అతనికి బాగా తెలుసు. సినిమా తారని చేస్తానని హామీ ఇచ్చాక, ఒకరోజు అతనితో వచ్చేశాను. అతని దగ్గర ఉన్నాక అతని అసలు స్వరూపం అర్థమయింది. అతనో పింప్! అది అర్థమయ్యాక ఒక డైరక్టరును పట్టుకున్నాను. అదొక్కటే నేను చేసిన తెలివయిన పని అన్నయ్యా' అంటుంది అతనితో లేచి వచ్చేసిన శోభ.

'ఈ దేశంలో వివాహ వ్యవస్థను కొన్నిసార్లు తరచి ఆలోచిస్తే, స్త్రీకి రక్షణ ఇస్తుందేమో? విదేశాలలోని స్త్రీలు విడాకులిచ్చినా, భర్తపోయినా పెద్దగా బాధపడరు.' అనుకుంటుంది శ్రీలక్ష్మి. అందగాడైన రమాపతి మైకంలో పడిపోయిన ఆమె జీవితం కుక్కలు చింపిన విస్తరిలాఅవకపోవటానికి కారణం ఆ వివాహ వ్యవస్తే! 'లక్ష్మీ, రమాపతికి ఈ హంగులెలా అబ్బాయిని ఆశ్చర్యపోతున్నావా? నా అందం తెచ్చిన హోదా ఇది. అందమైన ప్రతివారు నాలా అందంగా ఆలోచించాలి. కొందరు బుర్ర ఉపయోగిస్తారు. మరికొందరు అందం అడ్డువేసి సంపాదిస్తారు. అందమైన ఆడవాళ్ళయితే అంచెలంచెలుగా ఆకాశాన్ని అందుకోవచ్చు. నీవు సినిమా తారవు కాలేవు కానీ మంత్రులను శాసించే ఆకర్షణ నీలో ఉంది అంటాడు. పరువు, మర్యాద అన్నీ పోయాయి శోభా! ఎవడితోనో ఉండమంటాడు. ఆ ఫొటోలు తీసి వాళ్ళను భయపెడతాడు. గుడ్డిలో మెల్ల ఇంకా ఎవరికో అప్పచెప్పటం లేదు' అని వాపోతుంది లక్ష్మి.

'ఏమిటో శోభ! స్త్రీని అణగదొక్కారు, స్వతంత్రం కావాలన్నారే తప్ప ఎలాంటి స్వాతంత్రమో చెప్పలేదు. ప్రముఖుల పుస్తకాలు చదివినా, పురుషుడు లైంగిక స్వేచ్ఛను పొందాడు, స్త్రీకి ఎందుకు లేదు అని దాన్నే ప్రోత్సహించి విశృంఖలత్వాన్ని ప్రోత్సహించారు. మౌలికమైన ఒక్క విషయం మరచిపోయారు. స్త్రీకి మాతృత్వం అనే మహత్తరమైన వరం ఉందని. తన జన్మకు కారకులైన తల్లితండ్రుల మధ్య పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని! స్వేచ్ఛకు, వ్యక్తిత్వానికి నిర్వచనమే తప్పు చెప్పారేమో. అందుకే స్త్రీలు అటు, ఇటు గానీ దోవలో కొట్టుకుంటున్నారు.'

'వదినా నా మాట విను ఉత్తముల కోపం క్షణంలో పోతుంది. మొదట కోపగించినా ఆయన ఆదరిస్తారు. ఆయన నిరాదరించిన నాడు నాదగ్గరకురా వదినా' అంటుంది శోభ.

శోభ లక్ష్మి భర్త అయిన రామచంద్ర గురించి వేసిన అంచనా వమ్ముకాదు. భార్యని పరాయి మగవారితో తీసిన ఫొటోలు రామచంద్రకి పంపినా, ఊరంతా సూదుల్లా పొడిచినా, భార్య వెనక్కి తిరిగివస్తే ముందు ఇంట్లోను, ఆ తర్వాత హృదయంలోనూ చోటు ఇస్తాడు.

మంగమ్మ స్థబ్దంగా ఉండి ఉండి ఏడుస్తుంది. ఆమెకు రామచంద్రను చూస్తే ఆ దుఃఖం ఉధృతం అవుతోంది. సమర్థుడైన భర్త అని నిరూపిస్తున్నాడు. ప్రతి పని భార్య సలహా లేనిదే చేయడు. లేచిపోయి తిరిగి వచ్చిన లక్ష్మికింత అదృష్టమా? భర్తను దేవుడులా పూజించిన తన కూతురు జీవితం మోడువారిపోవాలా?

కళావతి కూడా వాళ్ళిద్దరిని గమనిస్తుంది, ముచ్చటగా. అందం ఆకారంలో కాదు అంతరంగంలో ఉండాలని గ్రహించింది. తామెన్నడయినా అంత స్వచ్ఛంగా ప్రేమగా ఉన్నారా!

తను ఎంత అపురూపంగా ఉన్నతంగా పెరిగింది! రామచంద్ర తన ఇంట్లో ఓ పనివాడుగా పెరిగాడు. ఈనాడు అతను అందరికీ చేయి అందిస్తున్నాడు తను అందరి దగ్గర చేయి చాపుతోంది. ఈ స్థితి ఎందుకు వచ్చిందో అర్థం కాలేదామెకు!

అందరు ఆడవాళ్ళని తన అందంతో మైమరిపించిన రమాపతి అందం మూడునాళ్ళ ముచ్చటే అయింది. రమాపతిలో కూడా ఏదో మార్పు కనిపించింది. తలకు రంగులేదు. తెల్ల వెంట్రుకలు బయటపడ్డాయి. ముఖానికి క్రీములు లేవు. ముడతలు పడ్డ ముఖం

స్పష్టంగాకనిపిస్తోంది. చేతిలో ట్రిపుల్ ఫైవ్ సిగరెట్టు పెట్టలేదు. సెంటువాసన గుప్పుమనటం లేదు. జారిపోయే పళ్ళను మాటిమాటికి నాలుకతో పైకి లాక్కుంటున్నాడు. అందరిలో వెలుగు వెలిగిన రమాపతి సోదిలోకి కూడా లేకుండా పోయాడు. పనివాడుగా పెరిగిన రామచంద్ర పైకొచ్చాడు ఎందుకు? దానికి జవాబు రామచంద్ర ద్వారానే చెప్పిస్తారు రచయిత్రి.

దంపతుల మధ్య అనురాగం ఆరాధన, పరస్పర అవగాహన వుంటే ఆ సంసారం నిత్యనూతనంగా ఉంటుంది. వయస్సుతో నిమిత్తంలేదు. ఒక్క విషయం గ్రహించాడు రామచంద్ర. సమర్ధుడైన పురుషుడిని స్త్రీయే కాదు సంఘంలో వ్యక్తులంతా గౌరవిస్తారు. అది గమనించి పురుషుడు సోమరితనానికి బానిసకాకపోతే ఇల్లు ఓ స్వర్గం అవుతుంది.

మోసగాడయిన మగవాడి వల్ల అతని భార్యే కాదు. అతని చుట్టూ ఉన్న ఆడవాళ్ళు ఎలా నాశనమవుతారో, అలాగే సమర్ధుడైన మగవాడివల్ల కూడా అతని భార్యకాదు చుట్టూ ఉన్న ఆడవాళ్ళు ఎలా నిలదొక్కుకోగలరో నన్నది అద్దం పట్టి చూపే నవల.

## జ్ఞా న జ్యోతి



పసిపిల్లలవంటి పవిత్రమైన మనసున్న మనిషే ఆత్మోన్నతిని పొందగలుగుతాడు.అందుకే ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలకు నీ మనసులో చోటివ్వకు. పసిపిల్లల మనసులాగా నీ మనసును నిష్కల్మషంగా, నిర్మలినంగా ఉంచుకో. అప్పుడే నీవు ఉన్నతుడివి అవుతావు.